తుంగభద్రలో తోడేళ్లు..!

అధికారం మాటున తుంగభద్రలో ఇష్టానుసారంగా ఇసుకను తవ్వేసి తరలిస్తున్నారు. నిబంధనలు తుంగలో తొక్కి నదీ గర్భానికి తూట్లు పొడుస్తున్నారు. ప్రజాప్రతినిధుల అండతో అక్రమార్కులు ఇసుక దోపిడీ చేస్తున్నారు. తాయిలాలు ఎర వేస్తుండడంతో నిఘా యంత్రాంగం కళ్లకు గంతలు కట్టుకుందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధర కాదని ఒక్కో టిప్పునకు రూ.1,500 వసూలు చేస్తూ.. రెండు నెలల్లో రూ.కోటి పైగా దోపిడీకి పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. ఇసుక తరలింపుతో భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం పడుతుందని, నీటి కాలుష్యం, పర్యావరణ సమతుల్యత వంటి సమస్యలు తలెత్తుతున్నాయని పర్యావరణవేత్తలు ఆందోళన చెందుతున్నారు.



- నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు
- నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ ఆదేశాలు బేఖాతారు
- భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం
- ప్రభుత్వం నిర్ణయించిన రేటు కాదని వసూళ్లు
- రెండు నెలల్లో రూ.కోటికి పైగా అక్రమ సంపాదన



మా దృష్టికి రాలేదు

జిల్లాలో గుర్తించిన ఇసుక రీచ్‌లలో ప్రభుత్వం నిర్ణయించిన రేటు ప్రకారం టన్ను ఇసుకకు రూ.475 తీసుకోవాలి. అదనంగా వసులు చేయకూడదు. అయితే.. ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పేరిట ఒక్కో టిప్పరుకు అదంగా రూ.1,500 వసూలు చేస్తున్నట్లు నా దృష్టికి రాలేదు. దీనిపై విచారణ చేయిస్తాను. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు మరళి, గుడికంబాలి రీచ్‌లను తనిఖీ చేసిన మాట నిజమే. ఆ నివేదికను ప్రభుత్వానికి అందజేశాం.

- రాజశేఖర్, డీడీ,
గనులు భూగర్భ వనరులు శాఖ, కర్నూలు





మరళి రీచ్‌లో అదనంగా రూ.1500 వసూలు చేస్తూ రాసిచ్చిన బిల్లు

కర్నూలు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కౌతాళం మండలం మరళి, కుడికంబాలి గ్రామాల సమీపంలో తుంగభద్ర నదిలో అవినీతి తోడేళ్లు పడ్డాయి. ధనదాహంతో నిబంధనలు, నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ ఆదేశాలు తుంగలో కలిపేసి ఇష్టానుసారంగా తవ్వేసి అక్రమంగా రవాణా చేస్తున్నారు. రమళి, కుడికంబాలి గ్రామాల మధ్యలో తుంగభద్ర నదిలో భారీగా ఎత్తున ఇసుక నిల్వలు ఉన్నాయి. ఇక్కడ ఇసుక తవ్వకాలు, రవాణా కోసం గనులు, భూగర్భ వనరులు (మైనింగ్) శాఖ, జలవనరుల శాఖ, గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం, రెవెన్యూ అధికారుల కమిటీ క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఇసుక తవ్వకాల కోసం మరళి-1,2, గుడికంబాలి-1,2,3 కలిపి ఐదు రీచ్‌లకు అనుమతులు ఇచ్చారు. మైనింగ్ నిబంధనలు ప్రకారమే ఇసుక తవ్వకాలు చేయాల్సి ఉంటుంది. రెండేళ్ల క్రితం జేపీ పవర్ సంస్థకు ఇసుక తవ్వకాలు, రవాణా కోసం రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల లీజు అనుమతులు ఇచ్చింది. లీజు గడువు ముగిసినా యథేచ్ఛగా తవ్వకాలు సాగించారు. ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థకు ఇచ్చారు. ఇది సీఎం జగన్ సోదరుడికి చెందిన సంస్థ అని అంటున్నారు. గత డిసెంబరు 21వ తేదీ నుంచి ఈ సంస్థ రీచ్‌లతో ఇసుక తవ్వకం, రవాణా చేస్తోందని మైనింగ్ అధికారులు అంటున్నారు. అదే క్రమంలో రీచ్‌లతో సబంధం లేకుండా మంత్రాలయం నియోజకవర్గానికి చెందిన కీలక ప్రజాప్రతినిధి, ఆయన అనుచరులు రాత్రి పగలు తేడా లేకుండా అక్రమంగా తుంగభద్రను తోడేస్తున్నారు.

భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం:

తుంగభద్ర నదిలో ఇసుక నిల్వలు (శాండ్ డిపాజిట్)ను బట్టి అధికారుల బృందం సిఫారసు మేరకే ఇసుక తవ్వకాలు చేయాల్సి ఉంటుంది. 3 మీటర్లు లోతు వరకు ఇసుక నిల్వలు ఉంటే మీటరు, 6 మీటర్లు ఉంటే 2 మీటర్లు, 9 మీటర్లు ఉంటే 3 మీటర్లు వరకు ఇసుక తవ్వకాలు చేయవచ్చని మైనింగ్ అధికారులు పేర్కొంటున్నారు. మరళి, గుడికంబాలి రీచ్‌లు, వాటికి సమీపంలో మూడు నాలుగు మీటర్లు లోతుకు మించి ఇసుక నిల్వలు లేవని అధికారులే అంటున్నారు. ఆదోని సబ్ కలెక్టరు శివనారాయణస్వామి, మైనింగ్ శాఖ డీడీ రాజశేఖర్ నేతృత్వంలోని బృందం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి నిబంధనలు తుంగలో కలిపేసి తవ్వకాలు చేసినట్లు గుర్తించింది. అంతేకాదు.. మరళి రీచ్‌కు సమీపంలో అక్రమంగా నదిని తవ్వేసినట్లు గుర్తించారు. ఈ రీచ్‌లకు సమీపంలో దాదాపు 18 గ్రామాలకు తాగునీరు అందించే హాల్వి సమగ్ర రక్షిత మంచినీటి పథకం (ఎస్‌పీపీ స్కీం) ఉంది. ఆయా గ్రామాల నదితీరంలో అధికారిక ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. రైతులు సాగునీటి పంపుసెట్లకు ఏర్పాటు చేసుకున్నారు. ధనదాహంతో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వేడం వల్ల భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. తద్వారా వేసవిలో రక్షిత మంచినీటి పథకాలకు నీరు అందక ఆయా గ్రామాల్లో తాగునీటి ముప్పు పొంచి ఉంది.


టిప్పర్‌లో తరలిపోతున్న ఇసుక

రెండు నెలల్లో రూ.కోటికి పైగా దోపిడీ

ఇసుక టన్ను ఓపన్ రీచ్‌ల వద్ద రూ.475, డిసిల్టేషన్ రీచ్‌ల వద్ద రూ.625 ప్రకారం ప్రభుత్వం ధర నిర్ణయించింది. రవాణా చార్జీలు అదనం. ఇందుకు విరుద్ధంగా కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు అక్రమ వసుళ్లకు బరితెగించారు. మరళి రీచ్‌లతో పాటు సి.బెళగల్ మండలం కొత్తకోట, కె.సింగవరం, పల్లెదొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె వద్ద నాలుగు డిసిల్టేషన్ రీచులు (నది నీటిలో బోటు ద్వారా ఇసుక తవ్వకాలు) వద్ద ఇసుక తీసుకెళ్లాలంటే ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువ వసులు చేస్తున్నారని టిప్పరు యజమానులు ఆరోపిస్తున్నారు. దీంతో వినియోగదారులకు భారం తప్పడం లేదు. మరళి రీచ్ వద్ద టన్ను ఇసుక రూ.525 తీసుకోవడంతోపాటుగా డెలప్‌మెంట్ చార్జి పేరిట ఒక్కో టిప్పరుకు రూ.1,500 అక్రమంగా వసూలు చేస్తున్నారు. ఇసుక బిల్లు వెనుక భాగంలో రూ.1,500 తీసుకున్నట్లు రాసిచ్చి.. ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పేరిట ఓ సీలు వేసి ఇస్తున్నారు. ఇలా వసులు చేయడం పూర్తిగా అక్రమమని మైనింగ్ అధికారులే అంటున్నారు. రోజుకు సగటున అన్ని రీచ్‌లలో 125-150 టిప్పర్ల ఇసుక రవాణా అవుతోంది. 125 టిప్పర్లకే లెక్కించినా రోజుకు రూ.1.87 లక్షల చొప్పున నెలకు రూ.56 లక్షలకు పైగా మినరల్ కార్పొరేషన్ పేరిట అక్రమంగా వసులు చేసినట్లు తెలుస్తోంది. ఈ రెండు నెలల్లో రూ.కోటి పైగా దోపిడీ చేసినట్లు సమాచారం.

బీజేపీవి బ్లాక్ మెయిల్ రాజకీయాలు

- 20న విజయవాడలో సదస్సు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామక్రిష్ణ


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామక్రిష్ణ

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 17: నరేంద్ర మోదీ ప్రభుత్వం బ్లాక్ మెయిన్ రాజకీయాలు చేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామక్రిష్ణ అన్నారు. శనివారం సీఆర్ భవన్‌లో జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, జిల్లా నాయకులు కే జగన్నాథంతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామక్రిష్ణ మాట్లాడుతూ నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక వ్యవస్థలన్నింటినీ తన గుప్పిట్లో పెట్టుకుని ప్రశ్నించే వారిపై ఈడీ, సీబీఐ అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. యువతకు రెండు కోట్ల ఉద్యోగాల ఇస్తామని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గిస్తామని, నల్లధనం తెప్పిస్తామని చెప్పిన హామీలు ఎక్కడికిపోయాయని ఆయన ప్రశ్నించారు. బీజేపీ అధికారంలోకి రాకముందు రూ.55 లక్షల కోట్ల అప్పు ఉంటే ప్రస్తుతం రూ.156 లక్షల కోట్లకు చేరిందని తెలిపారు. తెలుగోడి ఆత్మగౌరవాన్ని వైసీపీ, టీడీపీలు ఢిల్లీలో తాకట్టు పెట్టాయని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు బీజేపీ వ్యతిరేక శక్తులన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 20న సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహిస్తున్న సదస్సుతో దేశ, రాష్ట్ర రాజకీయాల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటాయని తెలిపారు. దేశాన్ని కాపాడుకోవడానికి అందరూ ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలి

ఏపీ జేఏసీ డిమాండ్



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేస్తున్న ఏపీ జేఏసీ ఉద్యోగులు

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 17: రాష్ట ప్రభుత్వం 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని ఏపీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని కోరుతూ శనివారం కలెక్టరేట్ ఎదుట ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ నగర చైర్మన్ ఎంసి కాశన్న మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయకుండా వైసీపీ ప్రభుత్వం కాలయాపన చేయడం తగదన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రతి ఉద్యోగికి కనీసం రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు బకాయిలను పెండింగ్‌లో పెట్టిందన్నారు. విడుదల చేయకపోవడంతో ఉద్యోగులు ఆర్థిక పరిస్థితి బాగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాత పెన్షన్ పునరుద్ధరించాలని కోరారు. ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 20 జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ, 27న చలో విజయవాడ కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జవహర్, ఫ్యాప్టో జిల్లా చైర్మన్ గోకారి, ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మద్దిలేటి, ఎన్జీవో జిల్లా నాయకులు బలరామిరెడ్డి, వ్యవసాయ శాఖ ఉద్యోగుల సర్వీసు సంఘం అధ్యక్షులు రవిప్రకాశ్‌రావు, పెన్షనర్ల సంఘం నాయకులు బాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలు ఖాళీ

- రాప్తాడు సిద్ధం సభకు 220 బస్సులు
- ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు


ఆదోని ఆర్టీసీ డిపో

కర్నూలు(రూరల్)/ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 17: కర్నూలు జిల్లాలో ఆర్టీసీ డిపోలు ఖాళీ అయ్యాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఏపీలో ఎక్కడ సభ పెట్టిన ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. తాజాగా అనంతపురం జిల్లాల్లోని రాప్తాడులో ఆదివారం వైసీపీ నాయకులు సిద్ధం సభను ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాల నుంచి పెద్దఎత్తున జనం తరలింపునకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కర్నూలు జిల్లాలోని ఏడు డిపోల నుంచి 220 బస్సులకు పైగా అనంతపురం జిల్లాలో జరిగే జగన్ సభకు తరలించారు. ఆదోని ఆర్టీసీ డిపోలో 78 బస్సులు ఉండగా 59, పత్తికొండ డిపోలో 25 బస్సులు ఉండగా, 17, ఎమ్మిగనూరు డిపో నుంచి 32 బస్సులు, కర్నూలు డిపో-1 నుంచి 53, డిపో-2 నుంచి 52 బస్సులను పంపించారు. ఇప్పటికే బస్సులన్నీ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు గ్రామాలకు చేరుకున్నాయి. అక్కడి నుంచి నేరుగా రాప్తాడులో జరిగే సిద్ధం సభ ప్రాంగణానికి వెళ్లి అనంతరం సభ ముగింపు తర్వాత తిరిగి ఆయా గ్రామాలకు రాత్రిలోపు చేరుకుంటాయి. ఉన్నపలంగా బస్సులన్నీ జగన్ సభకు వెళితే ప్రయాణికుల పరిస్థితి ఏమిటని సిటిజన్‌ల నుంచి విమర్శలు వస్తున్నాయి.

59 బస్సులు పంపమన్నారు..

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్టీసీ డిపోలోని 59 బస్సులను అనంతపురం జిల్లాకు పంపాం. హైటెక్ బస్సులు మినహా, మిగితా సర్వీసులన్నీ రద్దు చేసి సీఎం సభకు పంపాం.

- మహమ్మద్ రఫి, ఆర్టీసీ డిపో మేనేజర్, ఆదోని

రేపు స్పందన : కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 17: కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు.

రెండో స్వాతంత్ర్య సంగ్రామానికి సిద్ధం కావాలి

- సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాల గౌడ
- కర్నూలులో రాజ్యాంగ పరిరక్షణ సదస్సు



కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 17: రెండో స్వాతంత్ర పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలని, బీజేపీ దానికి మద్దతునిచ్చే పార్టీలను సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాల గౌడ పిలుపునిచ్చారు. శనివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో భారత రాజ్యాంగ హక్కుల పరిరణ వేదిక ఆధ్వర్యంలో 'రాజ్యాంగాన్ని రక్షించుకుందాం-ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సునకు ముఖ్య అతిథులుగా జస్టిస్ గోపాల గౌడ, సుప్రీంకోర్టు ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, ప్రముఖ రాజ్యాంగ విశ్లేషకులు ఫైసల్ ఖాన్ హాజరయ్యారు. వీరితో పాటు రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాదీశ్వరరావు, వేదిక కో కన్వీనర్ విజయరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జై భారత్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జేడీ లక్ష్మీనారాయణ, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కె.తులసిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్, ఏపీ ఎస్సీ, ఎస్టీ లాయర్ల ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ అధ్యక్షుడు వై.జయరాజు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ గోపాల్ గౌడ మాట్లాడుతూ దేశంలో ప్రస్తుతం ప్రమాదకరమైన పరిస్థితి నెలకొందన్నారు. కౌరవుల్లాంటి బీజేపీ పాలనను సాగనంపేందుకు పాండవుల్లాంటి పార్టీలకు ప్రజలే శ్రీకృష్ణులై సహకరించి, పజాస్వామ్యవాదులకు అండగా నిలవాలని కోరారు. 77 ఏళ్ల స్వాతంత్ర దేశంలో పేదలు పేదలుగానే ఉన్నారని, కార్మికులకు సరైన వేతనాలు దక్కడం లేదన్నారు. యువతకు ఉద్యోగాలులేవని పదేళ్లుగా బీజేపీ సర్కారు ప్రజలతో ఆడుకుంటోందని అన్నారు. స్వామినాథన్ దేశమంతా తిరిగి అనేక సిఫార్సులు చేయడమే కాక, రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వాలని చెప్పారని గుర్తు చేశారు. కానీ నేటికీ దాన్ని ఈ ప్రభుత్వాలు అమలు చేయకుండా స్వామినాథన్‌కు భారతరత్న ఇచ్చి గొప్పలు చెప్పుకుంటోందని అన్నారు. డిల్లీ సరిహద్దులో ఏడాది పాటు రైతులు ఆందోళన చేయగా మద్దతు ధర ఇస్తామని హామీలు ఇచ్చి నేటికీ అమలు చేయడం లేదని విమర్శించారు. కార్పొరేట్లకు ఉపశమన చర్యలు చేస్తున్న మోదీ సర్కారు రైతుల సమస్యలు ఎందుకు పట్టించుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. జీఎస్టీ వసూలుకు చర్యలు తీసుకున్నప్పుడు రైతులకు కనీస మద్దతు ధర ఎందుకు ఇవ్వరని అన్నారు.



జస్టిస్ గోపాల గౌడ ప్రసంగిస్తుండగా వేదికపై ఆసీనులైన ప్రశాంత్ భూషణ్, వడ్డే శోభనాదీశ్వరరావు, చలసాని శ్రీనివాసరావు తదితరులు

● సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ దేశంలో రైతులు, కార్మికులు, మైనార్టీలు మోదీ పాలనలో ఆందోళన చెందుతున్నారని అన్నారు. వ్యవసాయాన్ని అదానీ, అంబానీలకు కట్టిబెట్టేందుకు మూడు నల్ల చట్టాలు తెచ్చి రైతులను తీవ్ర ఇబ్బంది పెట్టారన్నారు.

● రాజ్యాంగ విశ్లేషకులు ఫైజల్ ఖాన్ మాట్లాడుతూ మోదీ అందరినీ విడదీసి, బ్రిటీషువారిలా విభజించి పాలిస్తున్నారని చెప్పారు. ఓటు ద్వారా బీజేపీకి బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు.

● చలసాని శ్రీనివాస్, జేడీ లక్ష్మీనారాయణ, తులసిరెడ్డిలు మాట్లాడుతూ రాష్ట్రాన్ని రెండుగా చీల్చి విభజన హామీలను తుంగలో తొక్కింది బీజేపీ ప్రభుత్వమేనని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా అంశంలో మాటమార్చి రాష్ట్రాన్ని ఆర్థికపరంగా పదేళ్ల వెనక్కు నెట్టేసిందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని, కేంద్రంలో బీజేపీని సాగనంపేదిశగా ఓట్లు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ప్రభాకర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య, సీపీఎం నాయకులు గౌస్ దేశాయ్, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

దగా డీఎస్సీ మాకొద్దు : ఎన్‌ఎస్‌యూఐ



మంత్రి బుగ్గన ఇంటి ముట్టడికి ర్యాలీగా వెళ్తున్న ఎన్ఎస్‌యుఐ నాయకులు

డోన్(రూరల్), ఫిబ్రవరి 17: రాష్ట్ర ప్రభుత్వం ఆరు వేల పోస్టుల భర్తీతో విడుదల చేసిన దగా డీఎస్సీ తమకొద్దని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగ మధు యాదవ్ అన్నారు. శనివారం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో కార్యకర్తలు డోన్‌లో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఇంటి ముట్టడికి యత్నించారు. పట్టణంలోని ప్రధాన రోడ్డు నుంచి మంత్రి ఇంటి ముట్టడికి ర్యాలీగా వెళ్తుండగా పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, తన పోలీసు సిబ్బందితో వారిని అడ్డగించి పోలీసు జీపులో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాగమధు యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల ముందు సీఎం జగన్ నిరుద్యోగుల కోసం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పారని అన్నారు. నాలుగున్నరేళ్ల తరువాత ఆరు వేల పోస్టులతో డీఎస్సీ విడుదల చేసిందని తెలిపారు. ఎన్నికల వేళ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి, మెగా డీఎస్సీ అని ప్రకటించుకోవడం సిగ్గుచేటన్నారు. రాబోయే ఎన్నికల్లో నిరుద్యోగులు వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా, రాష్ట్ర నాయకులు తెలుగు విజయకుమార్, సాయి కుమార్, శ్రీను, జనార్దన్, బండారు శివ, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

టీజీ వెంకటేష్‌కు ప్రతిష్టాత్మక అవార్డు



తెలంగాణ గవర్నర్ నుంచి అవార్డు అందుకున్న టీజీ వెంకటేష్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 17: మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌కు ప్రతిష్టాత్మక సంసద్ మహారత్న అవార్డు దక్కింది. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా ఆయన పనితీరును గుర్తిస్తూ 14వ సంసద్ మహా రత్న అవార్డుకు ఎంపికయ్యారు. శనివారం న్యూఢిల్లీలోని మహారాష్ట్ర సదన్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర్య రాజన్ చేతుల మీదుగా టీజీ వెంకటేశ్ అవార్డును అందుకున్నారు. రాజ్యసభ సభ్యుడిగా ఉన్న సమయంలో రవాణా, పర్యాటకం, జాతీయ రహదారులు, పౌర విమానయానం, రైల్వే భద్రత, సాంస్కృతిక శాఖలకు సంబంధించి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా టీజీ వ్యవహరించారు. ఆయన సేవలను గుర్తించిన ప్రేమ్ పాయింట్ ఫౌండేషన్ అనే సంస్థ 2022-23 సంవత్సరానికి సంసద్ మహారత్న అవార్డుకు టీజీ వెంకటేశ్‌ను ఎంపిక చేసింది. అవార్డు అందుకున్న ఆయన్ను పలువురు అభినందించారు.

బీజేపీ దేశానికి శని గ్రహం

- పదేళ్లలో రూ.115 కోట్ల అప్పులు
- రాష్ట్రంలో బీజేపీ పాలన
- మీడియా చైర్మెన్ ఎన్. తులసిరెడ్డి

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 17: దేశానికి బీజేపీ శనిగ్రహం లాంటిందని, టీడీపీ, వైసీపీలు రాహు, కేతువులని కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ ఎన్.తులసి రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు కే బాబురావుతో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ పాలన సాగిస్తోందని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయపోతే రాష్ట్రం మరింత అధ్వాన్న పరిస్థితికి దిగజారుతుందన్నారు. రాష్ట్రానికి జీవనాడిగా భావిస్తున్న పోలవరానికి పంగనామాలు పెట్టారని, ప్రత్యేక హోదాను అటకెక్కించారని అన్నారు. కడప స్టీల్ ప్లాంట్‌కు స్వస్తి పలికారని, ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కును అమ్మకానికి పెట్టారని విమర్శించారు. ఇలా రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన బీజేపీతో జతకట్టే దుష్టచతుష్టం పార్టీలైన వైఎస్సార్సీపీ, టీడీపీ, జనసేనలకు ఓట్లు వేస్తే రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన వారమవుతామని హెచ్చరించారు. 1947 నుంచి 2014 వరకు 67 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో పండిట్ నెహ్రూ నుంచి మన్మోహన్ సింగ్ వరకు ప్రధానులుగా రూ.46 లక్షల అప్పులు చేస్తే పదేళ్లలో మోదీ రూ. 115 కోట్ల అప్పులు చేసి దేశాన్ని అమ్మకానికి పెట్టారని మండిపడ్డారు. విమానాశ్రయాలు, ఓడరేవులు, రైల్వే, ఎల్ఐసీ సంస్థలను మోదీ, అమిత్ షాలు అమ్మకానికి పెడితే అంబానీ, ఆదానీలు కొనడానికి తెగబడ్డారని ధ్వజమెత్తారు. ఇలాంటి బీజేపీతో జట్టు కట్టడానికి ఆ మూడు పార్టీలు పాకులాడుతున్నాయని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయడమంటే మన కంటితో మన కన్ను పొడుచుకున్నట్లేనని ధ్వజమెత్తారు.



మాట్లాడుతున్న ఎన్.తులసి రెడ్డి

ఎన్నికల నిర్వహణ టీమ్‌లను ఏర్పాటు చేయండి

- జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి
- పెండింగ్‌లో ఉన్న ఓటరు దరఖాస్తులను పరిష్కరించండి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ డాక్టర్ జి.సృజన



కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 17: పెండింగ్‌లో ఉన్న ఓటరు దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన టీములను సోమవారంలోపు ఏర్పాటు చేయాలని కలెక్టర్ డా.జి.సృజన అధికారులను ఆదేశించారు. శనివారం రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు, సంబంధిత జిల్లా అధికారులతో పెండింగ్ దరఖాస్తులు, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరు, పోలింగ్ స్టేషన్‌లలో మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 6, 8 ఓటరు దరఖాస్తులను మూడు రోజుల్లోపు పూర్తి చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్‌లలో మౌలిక సదుపాయాలు ఉన్నాయా లేదా అని కచ్చితంగా తెలుసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఏ పోలింగ్ స్టేషన్‌లో కూడా టాయిలెట్, ర్యాంపు, విద్యుత్ సౌకర్యం, నీరు లేకుండా ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బంది ఒక రోజు ముందుగానే వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్తారని తెలిపారు. ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, ఈఈఎం, వీఎస్‌టీ, వీవీటీ టీములను సోమవారం నాటికి ఏర్పాటు చేయాలని ఆర్వోలను ఆదేశించారు. వీరికి శిక్షణ కూడా ఈ నెల 29 నాటికి పూర్తి చేయాలన్నారు. సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీస్ ఆఫీసర్లు పోలింగ్ స్టేషన్లకు సంబంధించి మ్యాపింగ్ 2, 3 నివేదికలను ఈ నెల 29లోపు సిద్ధం చేయాలని సూచించారు. 1500 మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉంటే యాక్సిలరీ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని కోరారు. 200 మీటర్ల పరిధిలో పొలిటికల్ పార్టీ కార్యాలయాలు ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ స్టేషన్‌లు కచ్చితంగా గ్రౌండ్‌ఫ్లోర్‌లోనే ఉండాలని స్పష్టం చేశారు. జర్నలిస్టు హౌసింగ్ స్కీం కింద జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు వెరిఫికేషన్ 6 స్టెప్ వ్యాలిడేషన్ ఆధారంగా ఉండకూడదని ఆర్డీవోలు, తహసీల్దార్లను ఆదేశించారు. ఐదు ఎకరాల పొలం, కారు ఉందా లాంటి అంశాలు వెరిఫికేషన్ చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. గతంలో ఇళ్ల స్థలాలు ఇచ్చారా అనే విషయంపై మాత్రం వెరిఫై చేయాలని సూచించారు. వెరిఫికేషన్ నివేదిక వచ్చిన తర్వాత కమిటీ సభ్యుల ద్వారా అనర్హులుగా ఉన్న వారిని సోమవారం పిలిపించి వారి అభ్యంతరాలు ఉన్నట్లయితే తెలుసుకోవాలని జాయింట్ కలెక్టర్‌కు ఆమె సూచించారు. అలాగే ఇళ్ల స్థలాలకు కావాల్సిన భూమిపై కూడా స్పష్టత ఇవ్వాలని ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

కర్నూలు, ఫిబ్రవరి 17: తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని తాండ్రపాడులో ఉన్న ఎస్ఆర్ కళాశాలలో ఇర్ఫాన్ (16) అనే విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన ఇర్ఫాన్ ఎస్ఆర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం (ఎంపీసీ) చదువతున్నాడు. కొద్ది కాలంగా ఒంటరిగా ఉండేవాడు. శనివారం కాలేజీకి వెళ్లకుండా హాస్టల్‌లో ఉన్నాడు. ఇర్ఫాన్ తోటి మిత్రులందరూ కళాశాలకు వెళ్లి తిరిగి సాయంత్రం హాస్టల్ గదికి చేరుకున్నారు. తలుపు గది లోపలి నుంచి గడియ పెట్టి ఉండటంతో విద్యార్థులు పాఠశాల యాజమాన్యానికి సమాచారం ఇచ్చారు. కళాశాల యాజమాన్యం అక్కడికి చేరుకుని తలుపులు గది పగులకొట్టి చూస్తే ఇర్ఫాన్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. ఇర్ఫాన్‌ను కిందకు దించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. ఇర్ఫాన్ తండ్రి షఫీవుల్లా రైతు పని చేస్తుంటాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీధర్ తెలిపారు.

అటవీ శాఖ అధికారులపై సస్పెన్షన్ వేటు

వెలుగోడు, ఫిబ్రవరి 17 : వెలుగోడు అటవీ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరిని సస్పెండ్ చేసినట్లు అటవీశాఖ అధికారి ఖాన్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నల్లమల అటవీ ప్రాంతంలో చట్ట విరుద్ధంగా వ్యవహరించి, అసాంఘిక కార్యకలాపాలకు సహకరించిన సెక్షన్ ఆఫీసర్ జయరాజ్, బీట్ ఆఫీసర్ ఈదన్నలను ఆత్మకూరు అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ అలాన్ చొంగ్ టేరాన్ విచారణ చేసి సస్పెన్షన్ చేసినట్లు తెలిపారు.

శ్రీశైలంలో జంట ఆత్మహత్య

శ్రీశైలం, ఫిబ్రవరి 17: శ్రీశైలం దేవస్థానం వసతి గృహం గౌరీ సదన్ రూము 137లో ఓ జంట ఆత్మహత్య చేసుకుంది. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌కు చెందిన మల్లేష్(32), సరిత(28) ఈ నెల 13వ తేదీన ఉదయం శ్రీశైలం చేరుకుని గౌరీ సదన్ నందు 137 రూమును తీసుకున్నారు. నాలుగు రోజుల నుంచి రూమును రెన్యువల్ చేయలేదు. దుర్వాసన వస్తోందని పక్కగదిలో ఉన్న యాత్రికులు దేవస్థానం సిబ్బందికి తెలియజేశారు. అధికారులు పోలీసులకు సమాచారం తెలియజేశారు. శ్రీశైలం సీఐ ప్రసాదరావు ఘటనా స్థలానికి తలుపులు తెరిపించారు. గదిలో ఇద్దరు ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు గుర్తించారు. కాగా సరూర్ నగర్‌కు చెందిన మల్లేష్, సరితలు ఇద్దరు వివాహితులు. వారు కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగించేవారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పదవి కోసం పాకులాట

- ప్రైవేట్ స్కూల్లో కుమారుడు
- స్కూల్ కమిటీ చైర్‌పర్సన్‌గా భార్య
- వైసీపీ నాయకుడి నిర్వాకం



ప్రభుత్వ పాఠశాల

ఆదోని రూరల్, ఫిబ్రవరి 17: పదవుల కోసం వైసీపీ నాయకులు అడ్డదారులు తొక్కుతున్నారు. హోదా చిన్నదా? పెద్దదా? అని తేడా లేదు... ప్రభుత్వం తమది, తాము అనుకుంటే పదవి వచ్చి తీరాల్సిందే అన్నట్లు వైసీపీ నాయకుల వ్యవహారం కొనసాగుతోంది. తాజాగా ఆదోని మండలంలోని నెట్టేకల్లు ప్రభుత్వ పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ హోదా కోసం వైసీపీ నాయకుడి నిర్వాకం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. నెట్టేకల్లు ఎంపీయూపీ ప్రభుత్వ పాఠశాలలో 1 నుండి 8వ తరగతి వరకు 221మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఏడుగురు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు మంజునాథ 2020 సెప్టెంబరు 28న తన కొడుకు రాకేష్‌ను ఒకటో తరగతిలో చేర్పించాడు. 2021 అక్టోబరులో పాఠశాల విద్యాకమిటీ ఎన్నికలు జరిగాయి. విద్యా కమిటీ ఎన్నికల్లో మంజునాథ తన అధికార బలంతో భార్య సులోచనను కమిటీ చైర్‌పర్సన్‌గా గెలిపించుకున్నాడు. నెల తిరిగేలోపు మంజునాథ తన కొడుకు రాకేష్‌ను ఆదోనిలోని మల్లికార్జున ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చేర్పించాడు. విద్యార్థి రాకేష్ ప్రభుత్వ పాఠశాలలో అటెండెన్స్ లేకపోవడంతో గత ఏడాది అక్టోబరులో ప్రభుత్వమే రాకేష్ పేరును అటెండెన్స్ నుంచి తొలగించింది. అయినా రెండున్నర సంవత్సరాల వ్యవధిలో విద్యా కమిటీ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన సులోచన, ఆమె భర్త పాఠశాలలో జరిగే ప్రతి కార్యక్రమాల్లో పాల్గొంటూ రాచమర్యాదలు పొందుతున్నారు. నాడు - నేడు పనులు కూడా తన కన్నుసన్నల్లోనే జరిగేలా చక్రం తిప్పాడు. ఇందుకు సదరు పాఠశాల సిబ్బంది ఒత్తాసు పలికారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలో చదవని విద్యార్థి తల్లినే విద్యా కమిటీ చైర్‌పర్సన్‌గా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువు కొనసాగిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులే పాఠశాల కమిటీ అధ్యక్షులుగా అయ్యేందుకు అర్హులు. కానీ సదరు వైసీపీ నాయకుడు మాత్రం అడ్డదారుల్లో అధికారులను మోసం చేసి భార్యకు విద్యా కమిటీ చైర్‌పర్సన్ పదవిని తెచ్చుకున్నాడు. ప్రభుత్వ పాఠశాలలో జరిగే గౌరవ మర్యాదలు పొందుతూ, గణతంత్ర, స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొంటున్నారు. సమావేశానికి దర్జాగా హాజరవుతూ రాచ మర్యాదలు పొందుతున్నారు. ఇదిలా ఉండగా ప్రైవేట్ పాఠశాల సైతం టీసీ లేకుండా విద్యార్థికి అడ్మిషన్ ఇచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న విద్యా కమిటీ చైర్మన్, భర్త వృత్తంలో ఉన్న వారు (ఫైల్)

విద్యా కమిటీ చైర్మన్‌కు సమాచారం ఇచ్చాం

రాకేష్ పాఠశాలకు సరిగా రావడం లేదని విద్యా కమిటీ చైర్‌పర్సన్ సులోచనకు సమాచారం ఇచ్చాం. సదరు విద్యార్థి పాఠశాలకు గైర్హాజరు కావడంతో ప్రభుత్వమే ఆన్‌లైన్ అటెండెన్స్‌లో పేరును తొలగించింది.

- దిలీప్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు, నెట్టేకల్లు

మా పాఠశాలలో చదువుతున్నాడు

నెట్టేకల్లుకు చెందిన విద్యార్థి రాకేష్ తమ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. కానీ అతని చదువుకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో పొంద పర్చలేదు. ట్యూషన్ పరంగా చేర్చుకున్నాం.

-నరసింహ రాజు, మల్లికార్జున ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ హెచ్ఎం, ఆదోని

విచారణ చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

నెట్టేకల్లు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులే చైర్మన్‌గా కొనసాగాలి. ప్రైవేట్ పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులు చైర్మన్‌గా కొనసాగడం చట్టరీత్యా నేరం. ఈ విషయం నా దృష్టికి రాలేదు. నేడు విచారించి నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

- శ్రీనివాసులు ఎంఈఓ-2, ఆదోని

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

కర్నూలు(రూరల్)ఫిబ్రవరి17: కర్నూలు రెవెన్యూ డివిజనల్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టులకు శనివారం అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు 140మంది అభ్యర్థులు హాజరయ్యారు. అత్యధికంగా 33 హెల్పర్ పోస్టులకు 138 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు కమిటీ సభ్యులు వివరించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఇంటర్వ్యూలు సాయంత్రం 6 వరకూ కొనసాగాయి. ఇంటర్వ్యూలను కర్నూలు ఆర్డీఓ శేషిరెడ్డి, డీఎంహెచ్‌వో రామగిడ్డయ్య, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటలక్ష్మమ్మ నిర్వహించగా సీడీపీవోలు వరలక్ష్మీదేవమ్మ, అనురాధ, లూక్, ఆర్డీవో కార్యాలయ ఏఓ ఝాన్సీలక్ష్మీ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి



మాట్లాడుతున్న ఆర్డీవో శేషిరెడ్డి

ఓర్వకల్లు, ఫిబ్రవరి 17: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి కోరారు. శనివారం ఓర్వకల్లు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి అధికారులకు పలు సూచనలిచ్చారు. మండలంలో ఎన్ని గ్రామాలు ఉన్నాయి.. ఎన్ని పోలిం గ్ కేంద్రాలున్నాయి అనే విషయాన్ని తహసీల్దార్ నటరాజ్‌తో అడిగి తెలు సుకున్నారు. పోలింగ్ రోజు ఓటు వేయడానికి వచ్చే ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని కేంద్రాల్లో దివ్యాంగుల కోసం ర్యాంప్‌లు, వెలుతురు కోసం లైటింగ్, ఫ్యాన్లు, ఫర్నీచర్, తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. వీఆర్వోలు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

సి.బెళగల్, ఫిబ్రవరి 17: మండలంలోని బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి, బ్యాథోలి, బురాన్‌దొడ్డి, క్రిష్ణదొడ్డి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ అనుపమ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, కరెంటు తదితర వసతులన్నీ ఉండేలా చూడాలని బూత్ లెవల్ అధికారులకు ఆదేశించారు. తహసీల్దార్ వెంట బూత్ లెవల్ అధికారులు ఉన్నారు.

ముగిసిన తిరుణాల

కోడుమూరు(రూరల్), ఫిబ్రవరి 17: మండలంలోని అనుగొండలో అవధూత రామిరెడ్డితాత వార్షిక తిరుణాల ఉత్సవాలు శనివారంతో ముగిసినట్లు టీడీపీ నాయకులు అనంత పద్మనాభరెడ్డి, టీచర్ రామక్రిష్ణారెడ్డి, బంకు గిడ్డయ్య, లింగేశ్వరయ్య తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వేడుకల్లో భాగంగా ఎద్దుల బండలాగుపోటీలు ఉత్సాహంగా సాగాయన్నారు. విజేతలకు టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి రూ.30వేలు, కోట్ల హరిచక్రపాణిరెడ్డి రూ.22వేలు, హరికిరణ్, సుబ్రహ్మణ్యం రూ.17వేలు, ఎర్రలింగన్న రూ.12వేలు, చిన్న అయ్యన్న రూ.9 వేలు, డ్రైవర్ ఎల్లప్ప రూ.6వేలు, మాధవశంకర్ రూ.5వేలు, చిన్నరాముడు రూ.4 వేలు అందించారని, దాతలకు టీడీపీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

రేపు ఆలయ భూముల కౌలుకు వేలం

కోడుమూరు(రూరల్), ఫిబ్రవరి 17: మండలంలోని గోరంట్ల గ్రామంలో వెలసిన లక్ష్మీమాధవస్వామి, వీరభద్రస్వామి ఆలయ భూముల కౌలుకు ఈనెల 19న వేలం నిర్వహించనున్నట్లు ఈవో గుర్రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ వేలంలో పాల్గొనే వారు ఆధార్ కార్డు ఇవ్వాలని, రూ.5వేలు డిపాజిట్ చేయాలని తెలిపారు. వేలం దేవదాయ ధర్మాదాయ చట్టం ప్రకారం నిర్వహిస్తామని వివరించారు.

20న జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక

కర్నూలు(స్పోర్ట్స్), ఫిబ్రవరి 17: స్థానిక బీక్యాంపు క్రీడా మైదానంలో ఈ నెల 20న జిల్లా స్థాయి సీనియర్ మహిళా క్రీడాకారుల జట్టును ఎంపిక చేయనున్నట్లు జిల్లా సంఘం కార్యదర్శి పి.సువర్ణ శనివారం తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 23, 24 తేదీల్లో నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని ఆమె తెలిపారు. జిల్లా స్థాయి ఎంపికలో పాల్గొనే వారు 14 సంవత్సరాలు పైబడి ఉండాలని, ఈ నెల 20న ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే ఎంపికకు నేరుగా హాజరు కావాలన్నారు. రూ.10 ప్రవేశ రుసుం చెల్లించాలన్నారు.

టీడీపీ అభిమానికి ఆర్థిక సాయం

ఓర్వకల్లు, ఫిబ్రవరి 17: మండలంలోని కాల్వ గ్రామానికి చెందిన టీడీపీ అభిమాని మాదిగ స్వాములు రెండు రోజుల క్రితం నన్నూరు గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. శనివారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్వాములకు కాల్వ టీడీపీ నాయకుడు రజాక్ రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోండి

» యువతకు టీజీ భరత్ పిలుపు



మాట్లాడుతున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 17: మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకునే బాధ్యత యువతపైనే ఉందని టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. శనివారం నగర శివారులోని కేవీ సుబ్బారెడ్డి ఫార్మసీ కళాశాలలో విద్యార్థులతో టీజీ భరత్ ముఖాముఖి నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఎలాంటి నాయకుడు ఉంటే సమాజానికి మేలు జరుగు తుందన్న అంశంపై చర్చించారు. విజన్ ఉన్న చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే యువత భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తార న్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్క రూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేవీ సుబ్బారెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమిశెట్టి నవీన్, పార్లమెం ట్ మహిళా అధ్యక్షురాలు ముంతాజ్, శ్రీకాంత్‌రెడ్డి, రాజు యాదవ్, తదిత రులు పాల్గొన్నారు.

నేడు ధ్యాన మందిరంలో వెండి మకర తోరణం అలంకరణ

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 17: స్థానిక రాఘవేంద్ర నగర్‌లోని షిరిడీ సాయిబాబా ధ్యాన మందిరంలో బాబా విగ్రహ మూర్తికి వెండి మకరతోరణం, వెండి సింహాసనం అలంకరణ ఉత్సవం ఏర్పాటు చేసినట్లు కర్నూలు స్పిరిచ్యువల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు, పిరమిడ్ బ్రహ్మర్షి డాక్టర్ బీవీ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ డాక్టర్ జి. సృజన హాజరవుతారని ఆయన తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు, స్పిరిచ్యువల్ సొసైటీ సభ్యులకు బాబా వారి ప్రసాదాలు అందజేస్తారని ఆయన పేర్కొన్నారు.

మత రాజకీయాలు చేసే వారిని నమ్మొద్దు

» టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 17: మత రాజకీయాలు చేసే వారిని ప్రజలు నమ్మొద్దని టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. శనివారం నగరంలోని 12 వార్డులోని జెండా వీధిలో మాలిక్ బాషా, అబ్దుల్ అహ్మద్ తమ అనుచరులతో టీడీపీలో చేరారు. ఈసందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ కుల, మత బేధాలు లేకుండా నగరాన్ని అభివృద్ధి చేస్తానని హమీ ఇచ్చారు. టీడీపీ ప్రభుత్వం తీసుకొచ్చే ఉచిత ఇసుక విధానం వల్ల భవన నిర్మాణ కార్మికులకు మేలు జరుగుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే దుల్హన్ పథకాన్ని, రంజాన్ తోఫాను ముస్లిలకు అందిస్తామని అన్నారు.

● తమ ఉద్యోగాలన్ని వదులుకుని రాజకీయాల్లోకి వచ్చామని మాయ మాటలు చెబుతున్న వారిని నమ్మొద్దని టీజీ భరత్ సూచించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు చిన్నమ్మ, తిరుపాలుబాబు, ఈశ్వర్, మహబూబ్ ఖాన్, పండు, పెంచలయ్య, తారనాథ్, శ్రీను, బాలు, వినోద్, సోను, సాధిక్, జాకీర్, మహబూబ్, ఇసాక్, ఇర్ఫాన్, ఇమ్రాన్, అజార్ పాల్గొన్నారు.

● జోహరాపురం ఇందిరమ్మ కాలనీలోని సమస్యలను పరిష్కరిస్తామని టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. శనివారం నగరంలోని జోహరాపురం ఇందిరమ్మ కాలనీలో టీజీ భరత్ భరోసా యాత్ర చేపట్టారు.



టీడీపీలో చేరిన వారితో టీజీ భరత్

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి మహిళలు, యువత, వృద్ధులను కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాబ్జి, మెహన్, శ్రీనివాస్ గౌడ్., ముంతాజ్, గున్నా మార్క్, భాస్కర్, విజయరాణి, శాంతమ్మ, చిట్టెమ్మ, రమేష్, నాగరాజు, మాధవస్వామి, విజయలక్ష్మి, కౌలుట్లయ్య, భాస్కర్, ఆంజనే యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు





పూజల్లో పాల్గొన్న హైకోర్టు గవర్నమెంట్ ప్లీడర్ కేవీ రఘువీర్ కుటుంబ సభ్యులు, ఉత్సవాలకు హాజరైన భక్తులు

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 17: నగరంలోని సంక ల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం 8వ రోజు రాత్రి శ్రీదేవీ భూదేవి సమేత లక్ష్మీ వేంకటే శ్వర స్వామి వారు సింహ వాహనంపై విహరించారు. వేకువ జామున స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పంచా మృతాభిషేకాలు, విశేష అర్చనలు నిర్వహించారు. అనంతరం నవదుర్గా, లక్ష్మీ కుబేర హోమాలు నిర్వహించారు. రాత్రి సింహ వాహనంపై స్వామివారు, అమ్మవార్లు వీధుల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. మధ్యాహ్నం జరిగిన పూజా కార్యక్రమాల్లో హైకోర్టు గవర్నమెంట్ ప్లీడర్ కేవీ రఘువీర్ కుటుంబ సభ్యులు హాజరై స్వామివారికి పూజలు చేశారు. కార్యక్రమంలో నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కల్లే చంద్రశేఖర్ శర్మ, హెచ్ కే రాజశేఖర్‌రావు, గౌరవ సలహాదారు హెచ్‌కే మనోహర్‌రావు, ఆధ్యాత్మిక ప్రవచన కర్త కల్లే వేణుగోపాల్ శర్మ, కేజీ ప్రభాకర్‌రావు, కేవీ సుబ్బారావు, రాఘవేంద్ర, ఉమేష్, శివరాంప్రసాద్, కేవీ భాస్కర్‌రావు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

టీడీపీ ప్రభంజనంలో వైసీపీ గల్లంతే

» గౌరు చరిత, మల్లెల రాజశేఖర్



టీడీపీలో చేరిన వారితో గౌరు చరిత, మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, ఫిబ్రవరి 17: టీడీపీ ప్రభంజనంలో వైసీపీ గల్లంతు కావడం ఖాయమని టీడీపీ పాణ్యం ఇన్‌చార్జి గౌరు చరిత, పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని హుసేనా పురం గ్రామం ఎస్సీ కాలనీలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ, జనసేన నాయకులతో వారు కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలిచి అధికారంలోకి రావడం తథ్యమన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీసీలు, దళితులపై దాడులు, హత్యలు జరుగుతున్నా సీఎం జగన్ మిన్నకుండటం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నంద్యాల పార్లమెంటు మహిళా సంఘం నాయకురాలు పార్వతమ్మ, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకుడు మహబూబ్ బాషా, మాజీ ఎంపీటీసీ నాగరాజు, చిక్కోటి నాగరాజు, లోకేశ్, హరిబాబు, విక్రమ్, వడ్డె నారాయణ, కాటినేని నారాయణ, బజారు, వేణు, రామాంజనేయులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక: మండలంలోని కాల్వ గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ పాణ్యం ఇన్‌చార్జి గౌరు చరిత, పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ సమక్షంలో హుశేనాపురంలో శనివారం టీడీపీలో చేరారు. వీరికి గౌరు చరిత, మల్లెల రాజశేఖర్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో కాల్వ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మహబూబ్‌బాషా, మహ్మద్ సుల్తాన్, చిన్న అజ్మతుల్లా, మహ్మద్ హుశేన్‌బాషా, అబ్దుల్ రెహిమాన్, మీనా, అక్బర్ రాంప్, ఇబ్రహీం, మౌలాలి ఉన్నారు. కార్యక్రమంలో రజాక్, ఖాదర్ పాల్గొన్నారు.

పండ్ల తోటల పరిశీలన

సి.బెళగల్, ఫిబ్రవరి 17: మండలంలోని ఇనగండ్ల, మారందొడ్డి, బ్రాహ్మణదొడ్డి, పోలకల్లు గ్రామాల్లో రైతులు సాగు చేసిన పండ్లతోటలను శనివారం కోడుమూరు ఉద్యానవనశాఖ అధికారి మధుసూదన్‌గౌడు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పండ్ల తోటలను సాగు చేస్తున్న రైతులు వేసవిని దృష్టిలో పెట్టుకుని తోటలకు 15 రోజులకు ఒక్కసారి నీరందేలా చూడాలన్నారు. పండ్ల చెట్ల వద్ద మీటర్ లోతు గుంతను తవ్వి నీరు నిల్వ ఉండేలా చూడాలని, మూడేళ్ల వరకు పండ్లతోట లలో అంతర్ పంటలను కూడా సాగు చేసుకోవచ్చని రైతులకు సూచించారు. ఆయన వెంట బ్రాహ్మణదొడ్డి హార్టికల్చర్ అసిస్టెంటు చెంచురాజు, నాగన్న, నాయక్ రైతులు ఉన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి: జేఏసీ



ధర్నా చేస్తున్న ఉద్యోగులు

కోడుమూరు, ఫిబ్రవరి 17: ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని జేఏసీ మండల అధ్యక్షుడు శ్రీనివాసయాదవ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం మొండి వైఖరి వీడి ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సం బంధించిన పెండింగ్‌లో ఉన్న డీఏ, ఐఆర్, జీపీఎఫ్‌తోపాటు సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని అన్నారు. ఈ నెల 20న కర్నూలు కలెక్టరేట్ కార్యాలయం ముందు జరిగే ధర్నాలో ప్రభుత్వ ఉద్యోగులంతా పాల్గొనాలని కోరారు. యూటీఎఫ్, ఎస్టీయూ నాయకులు నవీన్‌యాదవ్, ఇస్మాయిల్, మార్క్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పంపిణీ

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 17: మెప్మా, అనూస్ బ్యూటీ అండ్ క్లినిక్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కోర్సు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. శనివారం దేవనగర్‌లోని అనూస్ బ్యూటీషి యన్ వద్ద డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, మెప్మా పీడీ నాగశివలీల హాజరై కోర్సు పూర్తి చేసిన 30 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సత్యనారాయణమ్మ, టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి, సీఎంఎం మురళి, టీఎంసీ విజయభారతి, సుధాకర్ పాల్గొన్నారు.

'ఒయాసిస్'లో ఘనంగా రెండో వార్షికోత్సవం

కర్నూలు(హస్పిటల్), ఫిబ్రవరి 17: కర్నూలు గాయత్రీ ఎస్టేట్‌లోని ఓయాసిస్ ఫెర్టిలిటీలో రెండో వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఒయాసిస్ ఫెర్టిలిటీ క్లీనికల్ హెడ్ డా.విజయలక్ష్మి, జూనియర్ కన్సల్టెంట్ డా.దివ్యభారతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా కాబోయే తల్లులను, ఐవీఎఫ్ శిశువులను వారు సన్మా నించారు. క్లీనికల్ హెడ్ డి.విజయలక్ష్మి మాట్లాడుతూ మారిన జీవనశైలి మార్పుల వల్ల సహజంగా గర్భం దాల్చలేకపోతున్నారన్నారు. ఆలస్యమైన మాతృత్వం, స్థూలకాయం, హార్మోన్ల అసమతుల్యత, పర్యావరణ, కారణాలతో దేశంలో సంతానలేమి పెరుగుతుందన్నారు. ఇటీవల పురుషుల్లో సంతానం కలిగే కణాలు తగ్గుతున్నాయని, దీనికి స్మోకింగ్, ఆల్కహాల్ కారణాలని, ఈసమస్య 40 నుంచి 45 శాతం ఉందని అన్నారు.

హంద్రీనీవా నుంచి చెరువులకు నీరు బంద్

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 17: ఉమ్మడి కర్నూలు జిల్లాలో హంద్రీనీవా కాలువ ద్వారా 77 చెరువులకు గత సంవత్సరం సెప్టెంబరు 19న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నీటిని విడుదల చేశారు. వర్షాభావ పరిస్థితులలో బీడు వారిన పొలాలకు చెరువులకు నీటి విడుదల చేయడం తో రైతులు, ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. వారి సంతోషం మూన్నాళ్ల ముచ్చటే అయింది. నాలుగు రోజుల క్రితం హంద్రీనీవా కాలువ నుంచి నీటి విడుదల ఆగిపోవడంతో చెరువుల కింద పంటలను సాగు చేస్తున్న రైతులు లబోదిబోమంటున్నారు. శ్రీశైలం జలాశయంలో ప్రస్తుతం 817 అడుగుల నీటి మట్టం మాత్రమే ఉంది. 39 టీఎంసీల నీరు నిల్వ ఉన్నాయి. మరో పది రోజులు మాత్రమే నీటి విడుదల జరుగుతుందని, జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. కనీసం ఈ పది రోజులైనా నీటి విడుదల కొనసాగించాలని, చివరి దశలో ఉన్న పంటలను చేతికందేలా చూడాలని కర్నూలు, నంద్యాల జిల్లాలోని వెంకటాపురం, జగదుర్తి, ఉడుములపాడు, బోగోలు తదితర గ్రామాల



వెలవెలబోతున్న వెంకటాపురం చెరువు

రైతులు నీటిపారుదల శాఖ అధికారులకు మొరపెట్టుకుంటున్నారు.

డీఈవోను కలిసిన ఎస్‌జీఎఫ్ కార్యదర్శి

కర్నూలు (స్పోర్ట్స్), ఫిబ్రవరి 17: కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారి సామ్యూల్‌ను జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి జోసెఫ్ లక్ష్మయ్య శనివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కర్నూలు జిల్లాలో జరిగిన స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి పోటీల గురించి వివరించారు. అలాగే జిల్లాలో జరుగుతున్న సంకల్పం ప్రాజెక్టు గురించి పీఎంశ్రీ స్కూల్ ప్లే గ్రౌండు డెవలప్మెంటు గురించి వివరించారు. జిల్లాలోని స్కూల్ గేమ్స్ మండల కో ఆర్డినేటర్లు, నియోజకవర్గం కోఆర్డినేటర్లకు సమగ్ర శిక్ష అభియా న్ ద్వారా మంజూరైన రూ.5వేలు ఖర్చు చేసినట్లుగా బిల్లులు తీసుకుని వస్తే వాటిని చెల్లించమన్నారు. సోమవారం సాయంత్రం 3 గంటలకు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో మండల నియోజకవర్గ కోఆర్డినేటర్లకు సమా వేశం ఏర్పాటు చేయాలని డీఈవో తెలిపారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కార్యదర్శి శేఖర్ ఉన్నారు.



డీఈవోకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జోసెఫ్ లక్ష్మయ్య

పంటల నమోదుకు గడువు పొడిగింపు

చాగలమర్రి, ఫిబ్రవరి 17: మండలంలో రబీలో సాగు చేసిన వివిధ పంటల నమోదు కార్యక్రమాన్ని ఈనె 19 వరకు పొడిగించినట్లు ఏవో రంగనేతాజీ తెలిపారు. శనివారం మల్లేవేముల, గొట్లూరు, రాజోలి గ్రామాల్లో వ్యవసాయ సిబ్బంది చేస్తున్న ఈక్రాప్ నమోదును పరిశీలించారు.

ఘనంగా అనఘాష్టమి వ్రతాలు



సామూహిక వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

కల్లూరు, ఫిబ్రవరి 17: నగరంలోని గుత్తిపెట్రోల్ బంక్ సమీపంలోని సూర్యనారాయణస్వామి ఆలయంలో అనఘాష్టమి వ్రతాలు ఘనంగా జరిగాయి. శనివారం చేపట్టిన సామూహిక వ్రతాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పంచమ వార్షికోత్సవంలో భాగంగా శ్రీగణపతి సచిదానంద స్వామీజీ ప్రియశిష్యుడు నాదప్రసాద వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంత్ర పుష్పం, మంగళహారతి, వేదస్వస్తి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ట్రస్టీ టి.శివరామకృష్ణ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత ప్రసాదాలు, అన్నదాన ప్రసాద వితరణ చేపట్టారు.

● **నేడు స్వామి అమ్మవార్ల కల్యాణం:** ఛాయా ఉషా సమేత సూర్యనారాయణస్వామి కల్యాణం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మక ర్తల మండలి సభ్యులు, ట్రస్టీ టి.శివరామకృష్ణ తెలిపారు. ఉదయం 10 గంటలకు చేపట్టనున్న స్వామి అమ్మవార్ల కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

దోమల వ్యాప్తిపై రగడ

● ప్రతిపక్ష పాత్రలో అధికార పార్టీ కార్పొరేటర్లు

● ముగిసిన సర్వసభ్య సమావేశం

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 17: నగరంలో నెల రోజులుగా దోమల వ్యాప్తి ఎక్కువగా ఉందని, నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకోవడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఘోరంగా వైఫల్యం చెందారని టీడీపీ కార్పొరేటర్లు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వైసీపీ కార్పొరేటర్లు సైతం దోమల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం సుంకేసుల రోడ్డులోని నూతన కౌన్సిల్ హాలులో మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా 2023-24 సవరించిన బడ్జెట్ అంచనాలను, 2024-2025 సంవత్సరపు బడ్జెట్ అంచనాలను సర్వసభ్య సమావేశంలో ఆమోదం కోసం చదివి వినిపించారు. అయితే నగరంలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని టీడీపీ కార్పొరేటర్లు డిమాండ్ చేయగా అదేమి పట్టించుకోకుండా ఎజెండాను కొనసాగించాలని మేయర్ చెప్పడంతో కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లకార్డులు పట్టుకుని మేయర్ పోడియం ముందు నిరసన తెలిపారు. దోమల వ్యాప్తిలో నగరంలో ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని టీడీపీ కార్పొరేటర్ కురువ పరమేష్ కంటతడి పెట్టుకోగా మేయర్ స్పందిస్తూ 'నీ నటన చాలు.. అదంతా మీ ప్రభుత్వం వచ్చినప్పుడు చూసుకో' అంటూ హేళనగా మాట్లాడారు. టీడీపీ కార్పొరేటర్లు ఏది అడిగినా కూర్చోండి భలే అడుగుతున్నారులే అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని 8వ వార్డులో జరుగుతున్న రోడ్డు నిర్మాణం పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని కార్పొరేటర్ పరమేష్ ఓ వీడియోను మేయర్‌కు చూపించేందుకు ప్రయత్నించారు. ఇంతలో మేయర్ కలగజేసుకుని అధికారులంతా వెళ్లాక వీడియో తీసుకుని బ్లాక్‌మెయిల్ చేస్తున్నావా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రతిపక్ష పాత్రలో అధికార పార్టీ కార్పొరేటర్లు

దోమలను నియంత్రించడంలో వైఫల్యం కావడంతో ప్రజలు తిడుతున్నారని 12వ వార్డు కార్పొరేటర్ అన్నెపోగు క్రాంతికుమార్ ధ్వజమెత్తారు. వార్డు సమస్యల గురించి ప్రశ్నించే హక్కు లేదా అని 4వ వార్డు వైసీపీ కార్పొరేటర్ అర్షియా పర్వీన్ నిలదీశారు. భగవాన్ బాలసాయిబాబా ట్రస్టుకు టీడీఆర్ ఎంత ఇచ్చారని అడుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని 50వ వార్డు కార్పొరేటర్ షేక్ అహ్మద్ అన్నారు. 39వ వార్డులో టౌన్‌ప్లానింగ్ అధికారులు కనబడం లేదని కార్పొరేటర్ సాంబశివరావు అన్నారు. శిల్పా టౌన్‌షిప్‌లో 60 అడుగుల రోడ్డు ఆక్రమణకు గురై ప్రస్తుతం 40 అడుగులకు వచ్చిందని కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి తెలిపారు. దోమలను నియంత్రించాలంటే హంద్రీలో పేరుకుపోయిన పూడికను తొలగించాలని 14వ వార్డు టీడీపీ కార్పొరేటర్ జకియా అక్సారి సూచించారు. 16వ వార్డులో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని టీడీపీ కార్పొరేటర్ విజయకుమారి ఎలిపారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వద్ద ఫేస్-2 కోసం సేకరించిన భూమి కబ్జాకు గురవుతోందని 51వ వార్డు టీడీపీ కార్పొరేటర్ మౌనికారెడ్డి కమిషనర్ దృష్టికి తెచ్చారు. అశోక్‌నగర్ పంప్ హౌస్‌లో స్థానిక కార్పొరేటర్, ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వకుండా రూ.2.50 కోట్ల పనులు ఎలా చేస్తారని కార్పొరేటర్ రాజేశ్వరరెడ్డి కమిషనర్‌ను ప్రశ్నించారు. కార్పొరేటర్ల ప్రశ్నలకు సంబంధిత అధికారులే సమాధానం చెప్పాలని కార్పొరేటర్ నరసింహులు కోరారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ పార్కు స్థలాల కబ్జాలపై ఎందుకు చర్యలు తీసుకోలేకపోతున్నారని అన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. రోడ్లు జనాలు లేని చోట్ల వేస్తే లాభం లేదని ఎమ్మెల్యే సుధాకర్ అన్నారు. జాతీయ రహదారి నుంచి సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు వరకు రోడ్డు వేశారని, ఆ రోడ్డు వల్ల ఎవరికి ఉపయోగం లేదని చెప్పారు.

దోమల నివారణకు ఫాగింగ్, గుర్రపు డెక్క తొలగించడం, దోమల లార్వాను సమూలంగా నాశనం చేయడం లాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని ఎ.భార్గవతేజ, కమిషనర్ తెలిపారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, ఎస్ఈ డి.వేణుగోపాల్, ఇన్‌చార్జి మోహన్ కుమార్, ఈఈలు శేషసాయి, షాకీర్ హుసేన్, అకౌంట్స్ ఆఫీసర్ చుండీ ప్రసాద్, హార్టికల్చర్ ఏడీ విజయలక్ష్మి పాల్గొన్నారు.



మేయర్ పోడియం ముందు నిరసన తెలుపుతున్న టీడీపీ కార్పొరేటర్లు



పాల్గొన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

మఠం అన్నదానానికి రూ.లక్ష విరాళం

మంత్రాలయం, ఫిబ్రవరి 17 : మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి బెంగుళూరుకు చెందిన సులాధి అనే భక్తుడు అన్నదానానికి రూ. లక్ష విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాస రావు, వెంకటేష్ జోషి తెలిపారు. శనివారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకొని చెక్కును విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షింతలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

స్వర్ణ పల్లకిపై దర్శనమిచ్చిన రాఘవేంద్రులు

మంత్రాలయం, ఫిబ్రవరి 17: రాఘవేంద్ర స్వామి స్వర్ణ పల్లకిలో భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో మఠం అర్చకులు బృందావనంకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి బృందావన ప్రతిమను స్వర్ణపల్లకిలో అధిష్టించి వైభవంగా ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ నిర్వహించి మఠం పీఠాధిపతి భక్తులకు ఫల,పుష్ప, మంత్రాక్షితలు పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

ప్రభుత్వ పెన్షనర్లకు ఉచిత వైద్య శిబిరం

ఎమ్మిగనూరు రూరల్ , ఫిబ్రవరి 17: పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో 19వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 3గంటల వరకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ఏపీ వీరన్న తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కర్నూలు మోడ్రన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉచిత విద్యుత్‌ను దూరం చేస్తున్న ప్రభుత్వం



విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 17: రాష్ట్ర ప్రభుత్వం రైతుల వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను దూరం చేయడం దారుణమని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, మంత్రాలయం నాయకులు భాస్కర్‌యాదవ్ అన్నారు. శనివారం ఎమ్మిగనూరులోని విద్యుత్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతులకు 9గంటల విద్యుత్‌ను అందజేస్తామని చెప్పి సీఎం జగన్ ఏడు గంటలు కూడా సక్రమంగా అందించలేకపోతున్నారన్నారని విమర్శించారు. పొలాలకు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు 9గంటల వ్యవసాయ విద్యుత్‌ను అందజేయకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారిణికి వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం తాలుకా కార్యదర్శి కేజీ జబ్బార్, సమీఉల్లా, తిమ్మగురుడు, వీరేష్, విజయేంద్ర, మునిస్వామి, నరసింహులు, సుంకన్న, మల్లికార్జునగౌడు, ఇస్మాయిల్ లు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ఎమ్మిగనూరు టౌన్ , ఫిబ్రవరి 17: పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో శనివారం ఎమ్మిగనూరు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుట్టారేణుకా సీఎం సహాయ నిధి చెక్కులను బాధితులకు అందజేశారు. సీఎం సహాయ నిధికి దరఖాస్తున్న చేసుకున్న 13 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.8.92లక్షలను అందజేశారు. వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్, ముగతి సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, నీలకంఠ, విశ్వనాథ్ రమేష్, వాహిద్ లు పాల్గొన్నారు.

రాజధాని ఫైల్స్ సినిమాతో జగన్‌కు వణుకు

● మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి తిక్కారెడ్డి


మాట్లాడుతున్న తిక్కారెడ్డి

మంత్రాలయం, ఫిబ్రవరి 17: రాజధాని ఫైల్స్ సినిమాతో సీఎం జగన్ రెడ్డి వెన్నులో భయం పుట్టిందని టీడీపీ మంత్రాలయ నియోజకవర్గ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజధాని ఫైల్స్ సినిమా చూసి ముఖ్యమంత్రికి భయం పుట్టిందన్నారు. రైతుల బతుకుల చిత్రంగా నిర్మిస్తే ప్రభుత్వం నీచ స్థితికి దిగజారి అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. స్వచ్ఛందంగా అమరావతి రైతులు 34 వేల ఎకరాలు రాజధానికి త్యాగం చేస్తే జగన్ మాత్రం రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి సినిమాను జగన్ ప్రభుత్వం అడ్డుకోవడం దారుణమన్నారు. 5 కోట్ల ఆంధ్రుల కలలుగన్న రాజధానిని పిచ్చితుగ్లక్ సీఎం జగన్ మూడు రాజధానుల పేరుతో ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టి, మరోసారి మాయమాటలు చెప్పేందుకు సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు. టీడీపీ, జనసేన ఐక్యంగా విజయం సాధించి అమరావతే రాజధానిగా చేస్తామన్నారు.

ఉపాధ్యాయ సంఘాల నాయకులకు నోటీసులు

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 17: చలో విజయవాడలో పాల్గొనరాదంటూ ఉపాధ్యాయ సంఘాల నేతలకు పోలీసులు శనివారం నోటీసులు అందజేశారు. ఉద్యోగ,ఉపాధ్యాయ, కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ఏపీజేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 27న చలో విజయవాడను తలపెట్టింది. ఇప్పటికే ఆయా సంఘాల నాయకులు దశలవారి ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. శనివారం ఎమ్మిగనూరులో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి దేవపాల్‌కు మరికొందరికి పోలీసులు నోటీసులు అందజేశారు. దేవపాల్ మాట్లాడుతూ విజయవాడలో పాల్గొనరాదంటూ నోటీసులు ఇవ్వటం దారుణమని, ఉద్యోగ,ఉపాధ్యాయులను వేధిస్తే తిరుగబాటు తప్పదని హెచ్చరించారు.

ఎస్సార్ సేవా సమితి ఆధ్వర్యంలో వైద్య శిబిరం

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 17: పట్టణంలో శనివారం ఎస్ఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక సాయిబాబా దేవాలయ ప్రాంగణంలో కేడీసీసీ బ్యాంకు మాజీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో శాంతిరాం ఆసుపత్రి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచిత కంటి ఆపరేషన్లకు తీసుకెళ్లారు. కార్యక్రమంలో క్యాంపు నిర్వాహకులు శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు కొమ్ము నెట్టికల్లు, పందికోన మల్లికార్జున, వార్డు మెంబరు టైలర్ రంగన్న తదితరులు పాల్గొన్నారు.

సగానికి తగ్గిన రంగనాథస్వామి ఆలయ ఆదాయం

మద్దికెర, జనవరి 17: ప్రసిద్ధి చెందిన పెరవలి రంగనాథ స్వామి దేవాలయంలో తలనీలాలు పోగు చేసుకోవడానికి నిర్వహించిన వేలం పాటలుతో దేవాలదాయం గతం కంటే సగానికి తగ్గింది. ఈ వేలంపాటపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శనివారం ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డి, ఆదోని డివిజన్ తనిఖీ అధికారి వెంకటేశ్, దేవాలయ చైర్మన్ ఈడిగ దస్తగిరిగౌడు ఆధ్వర్యంలో 2024-25 సంబంధించి వేలం పాటలు నిర్వహించారు. వేలం పాటలో ఐదు మంది పాల్గొన్నారు. గత ఏడాది రూ.16.40లక్షలకు పాట పోయింది. ఈ ఏడాది తలనీలాల వేలం పాటను గత ఏడాది కంటే సగానికి సగం అంటే రూ.8.40 లక్షలకు అనంతపురం చెందిన రంగన్న అనే వ్యక్తి వేలం పాట పాడి దక్కించుకున్నారు. గతంలో వేలం పాటలు నిర్వహించినప్పుడు గ్రామానికి చెందిన వ్యక్తి రూ.9.60లక్షలకు పాట పాడినప్పటికీ అధికారులు గత ఏడాది కంటే తక్కువ పాడారనీ అందువల్ల మీకు ఇవ్వమనీ అప్పట్లో వాయిదా వేసిన విషయం తెలిసిందే.

ఇష్టపడిచదివితేనే మంచి ఫలితాలు : జీసీడీవో సునీత

పత్తికొండ, ఫిబ్రవరి 17: ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని బాలికాశిశు అభివృద్ధి జిల్లా అధికారి సనీత విద్యార్థినులకు సూచించారు. శనివారం పత్తికొండ కస్తూర్బా పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటర్ విద్యార్థినులతో సిలబస్ అంశాల గురించి మాట్లాడారు. పరీక్షలకు ఎలా సన్నద్ధం అవుతున్నారో అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల గురించి ప్రశ్నించారు.

ఏమైనా జరిగితే..

● బస్సులు లేక ప్రమాదపుటంచున ప్రయాణాలు
● ఆదోని, ఎమ్మిగనూరులో 90 శాతం బస్సులు మాయం
● జగన్ సిద్ధం సభకు తరలించిన అధికారులు
● పల్లెలకు చేరలేక ఇబ్బంది పడిన విద్యార్థులు

పక్క ఫొటోలో ప్రమాదపుటంచున ప్రయాణం సాగిస్తున్న విద్యార్థులు కోసిగిలో విద్యనభ్యసిస్తున్నారు. వీరంతా శనివారం బడులు ముగిశాక తమ సొంత పల్లెలలకు వెళ్లేందుకు ఇలా ప్రమాదకర ప్రయాణం సాగిస్తున్నారు. రోజూ ఆర్టీసీ బస్సులో వీరు సురక్షితంగా ఇళ్లకు చేరేవారు. అయితే, శనివారం ఆదోని, ఎమ్మిగనూరు డిపోలకు చెందిన 90 శాతం పల్లె బస్సులను సీఎం జగన్ సిద్ధం సభ రాప్తాడుకు అధికారులు తరలించారు. దీంతో ప్రయాణ సౌకర్యం లేక విద్యార్థులు ఇలా ఆటోకు ఇరువైపులా వేలాడుతూ ప్రయాణాలు సాగించాల్సి వచ్చింది. విద్యార్థుల కష్టాలను చూసిన తల్లిదండ్రులు పిల్లలకు ఏమైనా జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని పాలకుల, అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.


సీఎం సభకు బస్సులు తరలించడంతో ఆటోలో ఇలా వెళ్తున్న విద్యార్థులు

కోసిగి, ఫిబ్రవరి 17: మండల కేంద్రం కోసిగిలో బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ హైస్కూల్, మౌంట్ కార్నెల్ హైస్కూల్, ప్రైవేటు నారాయణ ఇంటర్, డిగ్రీ కళాశాలలో వందల సంఖ్యలో విద్యార్థులు వివిధ గ్రామాల నుంచి వచ్చి ఇక్కడ చదువుతున్నారు. శనివారం మధ్యాహ్నం నుంచి ఆదోని డిపో బస్సులు నిలిచిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మొత్తం ఆదోని డిపో నుంచి కోసిగికి 15 బస్సులు, ఎమ్మిగనూరు డిపో నుంచి 5 బస్సులు తిరిగేవి. ఆదివారం జరిగే జగన్ సిద్ధం సభకు అధికారులు బస్సులు తరలించడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదోని డిపో నుంచి సుమారు 90 శాతం బస్సులు సిద్ధం సభకు వెళ్లనున్నాయి. అలాగే ఎమ్మిగనూరు డిపో నుంచి 65బస్సులకు గానూ 59 బస్సులు సీఎం సభకు వెళ్తున్నట్లు ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో మేనేజర్ అమర్నాథ్ తెలిపారు. శనివారం ఉపాధ్యాయులు, ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే ఉద్యోగులు, ఆయా గ్రామాలకు వెళ్లే ప్రజలు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఉద్యోగులను వేధిస్తే తిరుగుబాటు తప్పదు

● బకాయిలన్నీ చెల్లించాల్సిందే
● ఈ నెల 27న చలో విజయవాడ
● ఏపీజేఏసీ జిల్లా చైర్మన్ వీసీహెచ్ వెంగల్‌రెడ్డి



ఆదోనిలో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న వెంగల్‌రెడ్డి

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 17: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులను వేధిస్తే తిరుగుబాటు తప్పదని ఏపీజేఏసీ జిల్లా చైర్మన్ వీసీహెచ్. వెంగల్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఎమ్మిగనూరులో తాలుకా జేఏసీ చైర్మన్ మద్దిలేటి ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీవో సమావేశ భవనం దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంగల్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలన్ని తక్షణమే చెల్లించాలని, 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేస్తామని దాని స్థానంలో అంతకంటే దుర్మార్గపూరితమైన జీపీఎస్ విధానాన్ని అమలు చేసి ఉద్యోగులను దగా చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 27వ తేదీ చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఆయా సంఘాల నాయకులు వరప్రసాద్, కరెక్రిష్ణ, రవికుమార్, బసవరాజు, యల్లప్ప, ఏపీ వీరన్న, ముస్తాక్ అహ్మద్, మల్లికార్జున, లోకేష్, శివరామిరెడ్డి, సురేష్, యాదగిరి, అడివన్న, కాశింబి, నాగమణి, భాగ్యలక్ష్మీ, సరస్వతి, హరిత, సుందరీబాయ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

ఆదోని (అగ్రికల్చర్): సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జేఏసీ కన్వీనర్ రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ వీసీహెచ్ వెంగల్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వానికి ఉద్యోగులు అంటే చిన్న చూపన్నారు. ఈ నెల 11న చీఫ్ సెక్రటరీకి 9 డిమాండ్లతో వినతి పత్రం అందజేస్తే చర్చల పేరుతో తమను నిర్లక్ష్యం చేశారని అన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో కార్యదర్శి మల్లికారున్ రెడ్డి, ఉపాధ్యక్షురాలు ఉషారాణి, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యాసీన్, ఏపీటీఎఫ్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘురామయ్య, అమలాథన్, యూటీఎఫ్ నాయకుడు సునీల్, ఆర్టీసీ నాయకులు హరిబాబు, లక్ష్మన్న, బజారప్ప, సురేష్, నాగేంద్ర, పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఆలూరు : ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జేఏసీ కమిటీ పిలుపు మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. జేఏసీ ఆలూరు తాలుకా చైర్మన్ మోహన్ మాట్లాడుతూ 12వ పీఆర్సీ మధ్యంతర భృతి ఐఆర్ 30 శాతాన్ని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్జీవో సెక్రటరీ బాలక్రిష్ణ, పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణ రెడ్డి, గోవిందప్ప, మజార్ బాష, మహేష్, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఖాశీం, ఎస్టీయూ మండల అధ్యక్షులు అశ్విన్‌కుమార్, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు శేషయ్య పాల్గొన్నారు.

అప్పుల ఊబిలో రాష్ట్రం : బీవీ

● గురుజాలలో మాజీ ఎమ్మెల్యే పల్లె నిద్ర
● గ్రామంలో ఇంటింటి ప్రచారం


గురజాలలో మహిళలతో మాట్లాడుతున్న బీవీ

నందవరం, ఫిబ్రవరి 17: నవరత్నాల కోసం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారని ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గురుజాల గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా బీవీ పర్యటించి, రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించి రాత్రి అక్కడే బస చేశారు. మొదట రామలింగేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతర అయన బస్టాండ్ సమీపంలో మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమలు లేక, యువత నిరుద్యోగులు పక్క రాష్ట్రాలకు వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతకు రాష్ట్రంలో పాలన ఉందా అని ఆయన ప్రశ్నించారు. వైసీపీ చేసే తప్పును మాట్లాడిన తప్పుడు కేసులు పెట్టి జైల్లో వేయించడం వైసీపీ నాయకులకు పరిపాటిగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024లో టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం, 18 ఏళ్ల దాటిన మహిళలకు నెలకు రూ 1500, నిరుద్యోగులకు నెలకు రూ 3000 ఇస్తామని పేర్కొన్నారు. ప్రతి గ్రామానికి తాగునీరు, రోడ్లతో పాటు అన్ని సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యాక్షుడు దేశాయి మాధవరావు, మండల పార్టీ కన్వీనర్ డివా రాముడు, మాజీ జెడ్పీటీసీ ఈరన్నగౌడు,మాజీ వైస్ ఎంపీపీ రఘుమూర్తి, రైస్‌మిల్ నారాయణరెడ్డి, గురురాజారావు, గురుజాల శివారెడ్డి, రామకృష్ణ రెడ్డి, చార్లెస్, జబ్బార్, వహాబ్, టి.ఈరన్న, మస్తాన్, బ్రహ్మానందరెడ్డి, గజేంద్రరెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జడ్పీ బాలికల పాఠశాల వార్షికోత్సవం


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

వెల్దుర్తి, ఫిబ్రవరి 17 : వెల్దుర్తి జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల వార్షికోత్సవం శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు చంద్రావతి ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డిప్యూటీ ఈవో హనుమంతరావు, ఏడి పౌల్, మండల కన్వీనర్ రవిరెడ్డి, జడ్పీటీసీ సుంకన్న, సర్పంచ్ ముత్యాల శైలజ, ఎంఈవో2 రమేష్, వావిలాల కృష్ణమూర్తి, సాయిప్రసాద్, సూదేపల్లె ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి, యశోదమ్మలు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముఖ్యఅతిథులు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలలో మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు తీసుకు రావాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించేవారికి ప్రోత్సాహకాలు ప్రకటించారు. డాక్టర్ మంజుల రూ.50 వేల విలువచేసే వస్తువులు(ప్రింటర్, కుర్చీలు) విరాళంగా అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వార్షికోత్సవానికి సహకరించిన దాతలను, అతిథులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. అదేవిధంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఉపాధ్యాయులు జ్ఞాపికలను బహుకరించారు. కార్యక్రమం ఆద్యంతం తల్లిదండ్రుల కరతాళధ్వనుల మధ్య కోలాహలంగా జరిగింది. వేలాది మంది తల్లిదండ్రులకు, విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించారు. తమ పిల్లలతో ఫోటోలు దిగడానికి తల్లిదండ్రులు పోటీ పడ్డారు. కార్యక్రమంలో బీసీ బాలికల హాస్టల్ వేల్ఫేర్ ఆఫీసర్ శైలజ, పీడీ నిర్మల, రిటైర్డు హెచ్‌ఎం అగస్టీన్, ఏఎస్ఐ బాలకృష్ణ, ఆర్ఐ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కాలేజీ ఏర్పాటు చేయాలి

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 17: పత్తికొండలో ప్రభుత్వ ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేస్తామని సీఎం జగన్ వాగ్దానం చేశారని, తక్షణమే ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు అల్తాఫ్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే శ్రీదేవికి ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. అల్తాఫ్ మాట్లాడుతూ పత్తికొండ పర్యటనకు వచ్చిన సీఎం జగన్ ఈ ప్రాంత విద్యాభివృద్ధి కోసం పాటుపడుతానని, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేస్తామని వాగ్దానం చేసి నెలలు గడుస్తున్నా ఇంత వరకూ నెరవేర్చలేదన్నారు. ఇప్పటికైనా వెనుకబడిన పత్తికొండ ప్రాంతంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ ఐటీఐ కళాశాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శ్రీదేవిని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మోహన్, పవన్, షాషావలి, వినోద్, హేమంత్, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై మరుగుదొడ్డి నిర్మాణం

● వైసీపీ మైనార్టీ నాయకుడి నిర్వాకం
● ఆగ్రహించిన కాలనీవాసులు
● రెండు గంటలపాటు రోడ్డుపై బైఠాయింపు


కోసిగిలో రోడ్డుపై బైఠాయించిన వడ్డెనగర్ కాలనీవాసులు

కోసిగి, ఫిబ్రవరి 17: కోసిగిలోని 9వ వార్డుకు చెందిన అధికార పార్టీ వైసీపీ ముస్లిం మైనార్టీ నాయకుడు తన ఇంటి సందులోని రోడ్డుపై మరుగుదొడ్డిని నిర్మించడంతో రోడ్డుకు అడ్డంగా ఉందని వడ్డెనగర్‌కు చెందిన సుమారు 200 మంది కాలనీవాసులు శనివారం కోసిగి బస్టాండు సమీపంలోని ఆదోని రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు.చచ పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీయడంతో ఏఎస్ఐ నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున స్వామి, కానిస్టేబుల్ తిప్పన్న, సంజీవకుమార్ అక్కడికి చేరుకొని ఇరువర్గాలను శాంతింపజేశారు. అయితే.. వడ్డెనగర్ కాలనీవాసులు ఎల్లప్ప, వీరేష్, రామయ్య, ఉలిగయ్య, వెంకటేష్, తిమ్మప్ప తో పాటు మరికొంత మంది మహిళలు ససేమిరా అని భీష్మించడంతో ఈవోపీఆర్డీ హరుణ్‌రషీద్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మరుగుదొడ్డి కొంత భాగం మైనార్టీ సోదరులు కూల్చివేయడంతో మిగిలిన కొంత భాగాన్ని పంచాయతీ అధికారులు సిబ్బందితో కూల్చివేశారు. అధికారం ఉందనే అండతో వైసీపీకి చెందిన మైనార్టీ నాయకుడు రోడ్డుపై అడ్డంగా మరుగుదొడ్డి నిర్మించడం ఏమిటని కోసిగి ప్రజలు ఆరోపిస్తున్నారు. సమస్య పరిష్కారం కావడంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అక్కడి నుంచి స్థానికులు పంచాయతీ కార్యాలయం చేరుకొని రోడ్డుపై మరుగుదొడ్డి నిర్మించేందుకు అనుమతి ఎలా ఇస్తారని అధికారులను నిలదీశారు.

పదో తరగతి విద్యార్థినికి ఆర్థిక సాయం

మంత్రాలయం, ఫిబ్రవరి 17: మంత్రాలయం పాఠశాలలో పదో తరగతిలో 590 మార్కులు సాధించి ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని శైలజకు కరస్పాండెంట్ గంగాధర్ రెడ్డి రూ.10వేలు, సతీష్‌చంద్ర రూ.10వేలు నగదును అందజేశారు. శనివారం రాత్రి స్థానిక శ్రీ వైష్ణవి పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభలో ఆర్ఎస్ఎస్ జిల్లా సేవా ప్రముఖ్ శేషారెడ్డి, హెచ్‌ఎం రాఘవేంద్ర, అశ్విని, మునిస్వామి, షఫీ, సైబా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉద్యమం ఉధృతం చేస్తాం

ఆలూరు, ఫిబ్రవరి 17: సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం ఉధృతం చేస్తామని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నాయకులు తిమ్మప్ప అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ బసవన్న గౌడ్‌కు వినతిపత్రం అందించారు. గ్రామ సహాయకుల సమస్యల పై ఈనెల 18,19,20వ తేదీల్లో గ్రామ రెవెన్యూ సహాయకుల జేఏసీ ఆధ్వర్యంలో విజయవాడలో దీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బియ్యం అందక ఆందోళన

హాలహర్వి, ఫిబ్రవరి 17: మండలంలోని కురేహళ్లి గ్రామంలో రెండు నెలలుగా బియ్యం అందడం లేదని ఆ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బియ్యం అందక ఆకలితో నలిగిపోతున్నామని, వెంటనే తమకు అందాల్సిన బియ్యం అందించాలని కోరారు. వీరి ఆందోళనకు సీపీఎం తాలుకా నాయకులు నారాయణస్వామి, కృష్ణ మద్దతు పలికారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మంత్రాలయం, ఫిబ్రవరి 17: మాధవరం చెక్‌పోస్టు వద్ద రాయచూరు జిల్లా అస్కేహల్లి గ్రామానికి చెందిన విజయకుమార్ అనే వ్యక్తి కర్ణాటక మద్యం మోటారు సైకిల్ పై తెస్తుండగా పట్టుకున్నట్లు మాధవరం ఎస్ఐ క్రిష్ణమూర్తి తెలిపారు. శనివారం రాత్రి కర్ణాటక నుంచి మోటారు సైకిల్ పై నాలుగు బాక్సుల్లో 90 ఎంఎల్ 384 ఒరిజినల్ చాయిస్ టెట్రా ప్యాకెట్లను పట్టుకుని సీజ్ చేశారు. విజయకుమార్‌ను అరెస్టు చేసి బైక్ సీజ్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లుఎస్ఐ తెలిపారు. హెడ్ కానిస్టేబుల్స్ వీరేష్, భాష్కర్ ఉన్నారు.

ఆలూరు : చిప్పగిరి మండలం నగరడోణ గ్రామంలో భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ సోమశేఖర్ శనివారం తెలిపారు. ఈ దాడుల్లో అదే గ్రామానికి చెందిన బోయ శ్రీనివాసులును అరెస్టు చేసి ఆయన ఇంట్లో నిలువ ఉంచిన 8 బాక్సులలో 768 టెట్రాప్యాకెట్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరుచగా 14 రోజులు రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

ఓపీఎస్ అమలు చేసే పార్టీలకే మద్దతు : యూటీఎఫ్

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 17: నాలుగున్నరేళ్లుగా సీపీఎస్ రద్దు చేస్తామని ప్రభుత్వం మోసం చేసిందని, పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని మేనిఫెస్టోలో చేర్చిన పార్టీలకే తమ ఉద్యోగుల మద్దతు ఉంటుందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గాదలింగప్ప అన్నారు. శనివారం ఆదోని జనసేన పార్టీ ఇన్‌చార్జి మల్లప్పను కలిసి ఓపీఎస్‌ను తమ జనసేన పార్టీ మేనిఫెస్టోలో చేర్చాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే జరగబోయే ఎన్నికల్లో జనసేన పార్టీ తమ ఉద్యోగుల సమస్యలు, సీపీఎస్ రద్దు, ఓపీఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణ చేస్తామని మేనిఫెస్టోలో చేర్చాలని కోరారు. నాయకులు మల్లికార్జున, కృష్ణమూర్తి, నరసయ్యగౌడ్, జనార్దన్, బసప్ప, కృష్ణుడు, నారాయణ, మహాదేవ, లింగన్న, విష్ణు, ఉరుకుంద, సాధిక్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలి

తుగ్గలి, ఫిబ్రవరి 17: ప్రతి ఉపాధ్యాయుడు సకాలంలో విధులకు హాజరు కావాలని, అలాగే మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈవో రమావెంకటేశ్ గౌడు అన్నారు. శనివారం మండల పరిధిలోని కడమకుంట్ల, హుశేనాపురంలోని ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించడంతో పాటు మధ్యాహ్న భోజనంను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాబు, ఉపాధ్యాయులు షక్కీరప్ప తదితరులు ఉన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

తుగ్గలి, ఫిబ్రవరి 17: గ్రామాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని పత్తికొండ ఎమ్మెల్యే కె.శ్రీదేవి అన్నారు. శనివారం మండలంలోని జొన్నగిరి, కడమకుంట్ల, పగిడిరాయి గ్రామాల్లో రూ.7.82 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రారంభించారు. జొన్నగిరిలో సీసీ రోడ్లు, కడమకుంట్లలో సచివాలయం, రైతుభరోసా, హెల్త్‌క్లీనిక్, సీసీ రోడ్లు, పగిడిరాయిలో సచివాలయం, రైతుభరోసా, అలాగే పగిడిరాయి నుంచి కలచట్ల వరకు వేసిన బీటీ రోడ్డును ఆమె ప్రారంభించారు. ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంపీపీ ఆదమ్మ, జడ్పీటీసీ పులికొండ నాయక్, జగన్నాథరెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి కష్టాలు

● హెచ్. కైరవాడిలో నాలుగు రోజులకోసారి నీరు
● అడుగంటిన ఐదు బోర్లు
● బతుకుదెరువు కోసం వలస వెళ్లిన సర్పంచు


కొళాయి దగ్గర గుమికూడిన జనం

గోనెగండ్ల, ఫిబ్రవరి 17: హెచ్ కైరవాడి గ్రామంలో నెల రోజులుగా తాగునీటి సమస్య తీవ్రతరమైంది. ఇక్కడ ఆరువేల జనాభా ఉంది. నాలుగు రోజులకు ఒక సారి మాత్రమే నీరు విడుదల చేస్తున్నారు. వేసవి కాలం వస్తుండడంతో గ్రామంలో ముందస్తుగా తాగునీటి ఇక్కట్లు తీవ్రమయ్యాయి. గ్రామ సమస్య పరిష్కరించాల్సిన సర్పంచు సువర్ణమ్మ పొట్టజేతపట్టుకొని బతుకుదెరువు కోసం కుటుంబ సభ్యులు కలసి వలస వెళ్లి పోయారని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు దృష్టికి తీసుకెళ్లాలో తెలియడం లేదని వాపోతున్నారు. గ్రామస్థులు డీపీవోను కలిసి సమస్యలు ఏకరువు పెట్టారు. తక్షణమే తాగునీటి సమస్య పరిష్కరించాలని మొరపెట్టుకున్నారు.

తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది

గ్రామంలో నెల రోజులుగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. సర్పంచు సువర్ణమ్మ బతుకు తెరువు కోసం వలస వెళ్లారు. గ్రామ అవసరాల కోసం హంద్రీ నదిలో వేసిన తొమ్మిది బోర్లలో ఐదు బోర్లు అడుగంటి పోయాయి. మిగిలిన నాలుగు బోర్లు రోజుకు గంట కంటే ఎక్కువ పారడం లేదు. సమస్యలు ఎవరికి తెలపాలో తెలియడం లేదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

- పెద్దయ్య, టీడీపీ ఎస్సీ సెల్ మండల నాయకుడు